క్లుప్తంగా

క్రికెట్ పోటీల విజేత మాకవరపాలెం



విజేత జట్టుతో నిర్వాహకులు

మాకవరపాలెం: మండల స్థాయి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో విజేతగా మాకవరపాలెం జట్టు నిలిచింది. పి.పి.అగ్రహారంలో ఇరవై రోజులుగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో బి.ఎస్.పేట జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ప్రథమ బహుమతిగా రూ.80 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 50 వేల చొప్పున నిర్వాహకులు ఆదివారం సాయంత్రం ప్రదానం చేశారు. బెస్ట్ బౌలర్, బ్యాట్స్‌మెన్, ఆల్‌రౌండర్లకు రూ.5 వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో గొంతిన హరిబాబు, బాలాజీ, సుకల శ్రీను, శేషుకుమార్, చక్రవర్తి పాల్గొన్నారు.

అన్నసమారాధనకు రూ.10 వేల వితరణ



అన్నసమారాధనలో రాజేష్ దంపతులు

మాడుగుల: వద్దాదిలో నాగివేలు అన్నసమారాధనకు ఎం. కోడూరు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేష్, వరలక్ష్మి దంపతులు రూ.10 వేలు వితరణగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీకి ఆదివారం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పాల్గొన్నారు.

క్షయ నివారణపై ర్యాలీ



గిడుతూరులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

మాకవరపాలెం: ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా గిడుతూరులో క్షయ వ్యాధి నివారణపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం వైద్యాధికారి సీతారామలక్ష్మి మాట్లాడుతూ క్షయ ప్రాణాంతకం కాదని, ఆదిలోనే గుర్తిస్తే నివారించవచ్చన్నారు. ఈ వ్యాధి తగ్గుముఖం పట్టిందని, అధిక రోజులు దగ్గు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



గన్నవరం మెట్ట వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు

నాతవరం: ఎన్నికల కోడ్‌నేపథ్యంలో నర్సీపట్నం – తుని మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుపై పోలీసులు ముమ్మరంగా వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. వచ్చి పోయే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేసి వదిలిపెడుతున్నారు. ఇప్పటికే రెండు జిల్లాల సరిహద్దు గన్నవరం మెట్ట వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. నిబంధనలు ఉల్లఘించి మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి సైతం జరిమానా విధిస్తున్నారు. పోలింగ్ సమయం దగ్గర పడేకొద్దీ తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు.

ఏఐటీయూసీ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



కొత్తగా ఎన్నికైన ఏఐటీయూసీ జిల్లా కమిటీ

అనకాపల్లి: జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షునిగా పెంటకోట సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో గౌరవాధ్యక్షుడిగా వైఎస్ భద్రం, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా గనిశెట్టి ఏసుదాసు, ఉపాధ్యక్షులుగా ఎం.అర్జున్‌కుమార్, కోన లక్ష్మణ, ప్రధాన కార్యదర్శిగా రాజాన దొరబాబు, కార్యదర్శులుగా ఎం.అప్పలరాజు, కండిపల్లి త్రినాథ్, కోశాధికారిగా రెడ్డిపల్లి అప్పలరాజుతో పాటు 13 మంది కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు.

అడుగడుగునా అభివృద్ధి

- సీసీరోడ్లుగా మారిన 11 మట్టిరోడ్లు
- రూ.9.34 కోట్లతో పలు పనులు పూర్తి
- వైఎస్సార్‌సీపీ పాలనలో తొలగిన కష్టాలు
- మేడిచర్ల గ్రామస్తుల ఆనందం



మేడిచర్ల-ఆర్.ఎన్.పాలెం తారురోడ్డు



మేడిచర్లలో సచివాలయం, ఆర్బీకే భవనాలు





గ్రామంలో సీసీరోడ్డు

కె.కోటపాడు: మేడిచర్లలో అభివృద్ధి వెలుగులు అడుగడుగునా దర్శనమిస్తున్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో ఈ గ్రామ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలతోపాటు సీసీరోడ్లు, అంతర్గత తారురోడ్ల నిర్మాణంతో కళకళలాడుతోంది.

మట్టిరోడ్ల స్థానంలో సీసీరోడ్లు

గతంలో పలు వీధుల్లో మట్టిరోడ్లు ఉండేవి. వర్షాకాలంలో రాకపోకలు చేసేందుకు గ్రామస్తులు ఇబ్బందులను ఎదుర్కొనేవారు. దీంతో రూ.1.73 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించారు. ఎస్సీకాలనీ, శ్మశాన వాటిక, పోలిపిల్లమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లే మార్గం, రామాలయం, సచివాలయం ప్రాంగణాల్లోను, వేమల, పోతల, ఆదిరెడ్డి, దొగ్గ వారి నివాసాలు, రాజిపాత్రుని కాలనీ, బొడబొడల వారి కాలనీల్లో సీసీరోడ్లు నిర్మాణం చేపట్టారు.

రెండు తారురోడ్ల నిర్మాణం

మేడిచర్ల నుండి రొంగలినాయుడుపాలేనికి రూ.1.90 కోట్లతోనూ, సూర్రెడ్డిపాలెం నుంచి మేడిచర్ల మీదుగా పైడంపేట వరకు రూ.4.60 కోట్లతో తారురోడ్లు నిర్మించారు. గతంలో మేడిచర్ల గ్రామస్తులు ఆయా గ్రామాలకు రాకపోకలు చేయాలంటే ప్రత్యామ్నాయ మార్గాల్లో సుదూరం వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఈ తారురోడ్ల నిర్మాణంతో తక్కువ సమయంలో ఇబ్బందులు లేకుండా హాయిగా ప్రయాణం చేస్తున్నారు.



కొత్తల, బడబడల వాసులకు నీరందించేందుకు సిద్ధమైన మంచినీటి ట్యాంకు

తీరిన తాగునీటి సమస్య

మేడిచర్లలో రక్షిత పథకానికి అదనంగా ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్య లేకుండా ఉండేందుకు రెండు రక్షిత పథకాలు ఏర్పాటు చేశారు. రూ.50 లక్షలతో మేడిచర్లలో 40 వేల లీటర్ల మంచి నీటి ట్యాంకు నిర్మించారు. కొత్తల, బడబడల నివాసాలకు రూ.30 లక్షలతో 10 వేల లీటర్ల మంచి నీటి ట్యాంకుతోపాటు ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేశారు. వీటితోపాటు తొమ్మిది చేతిపంపులను తవ్వించారు.

ఐదేళ్లలో అభివృద్ధి



గ్రామంలో సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారానికి కోట్లాది రూపాయలు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టిన పనులతో గ్రామంలో అడుగడుగునా అభివృద్ధి కనిపిస్తోంది. ఐదేళ్లలోనే ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధికి సహకరించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు.

– ఆదిరెడ్డి వెంకటరావు, మేడిచర్ల గ్రామం

ఏ వీధికెళ్లినా సీసీరోడ్డు



గ్రామంలో ఏ వీధికెళ్లినా సీసీరోడ్డు కనిపిస్తోంది. గ్రామాన్ని కలుపుతూ రొంగలినాయుడుపాలెం, సూర్రెడ్డిపాలెం గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్లను కోట్లాది రూపాయలతో తారు రోడ్లు నిర్మించారు.

– బొడ్డు తాతయ్యబాబు, మేడిచర్ల

తాగునీటి సమస్య కనుమరుగు



గ్రామంలో తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమైంది. ఇక్కడ అదనంగా 40 వేల లీటర్ల మంచినీటి ట్యాంకు, కొత్తల, బడబడల నివాసాలకు ట్యాంక్‌తోపాటు ఇంటింటి కుళాయిల నిర్మించారు. దీంతో ప్రజలకు తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమైంది.

– వి.అప్పారావు, మేడిచర్ల

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

ఘనంగా ముగిసిన వెంకన్న కల్యాణోత్సవాలు



స్వామివారికి పల్లకి సేవ చేస్తున్న భక్తులు

రోలుగుంట: వెంకన్న కల్యాణోత్సవాలు ఆదివారం గిరి ప్రదక్షిణతో ముగిశాయి. తొలుత స్వామివారిని రథంపై ఉంచి స్థానిక కొండ దిగువన కోనేటి నుంచి ఉదయం 7 గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. స్థానిక ఆస్పత్రి, ఆర్‌అండ్‌బీ రోడ్డులో చెరకు కాటా మీదుగా నిండుగొండ, అక్కడ నుంచి కె.నాయుడుపాలెం చేరుకున్నారు. అక్కడ నుంచి కొవ్వూరు నూకాలమ్మ గుడి మీదుగా కొండపైన వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు ఆరు కిలోమీటర్ల మేర భక్తులు గోవింద నామస్మరణతో పల్లకి సేవ చేసి గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం కల్పించారు. అర్చకుడు రేజేటి శ్రీనివాసశర్మ చక్రస్నానం చేయించారు. 300 మందికిపైగా భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు చేశారు. ఈ పూజా కార్యక్రమాలకు ముత్యాల రామస్వామి కుటుంబీకులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.

లక్ష్మీనారాయణస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనారాయణ స్వామి

మాడుగుల రూరల్: ఎం.కోడూరులో లక్ష్మీనారాయణ స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక తాచేరు నది ఒడ్డున చక్రస్నానం, నాగవల్లి సంబరాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ ఉత్సవాలు సోమవారంతో ముగిస్తున్నాయని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. అదే రోజు ఉదయం నుంచి స్వామి వారికి పూజలు, రాత్రికి స్వామి వారి ఊంజల్ సేవ, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగిస్తాయన్నారు.

నిరుపేద దివ్యాంగ విద్యార్థికి ఆర్థిక సాయం

మాడుగుల: పట్టణానికి చెందిన దివ్యాంగ విద్యార్థి యాదగిరి గోవింద్‌కు దాతలు రూ.37 వేలు వితరణగా అందించారు. ఇటీవల విద్యుదాఘాతానికి గురై అతడి కాలు, చేయి విరిగిపోయాయి. దీంతో తన ఉన్నత చదువులకు దివ్యాంగత్వంతోపాటు పేదరికం అడ్డు తగిలింది. కూలి పని చేసుకుని కుటుంబాన్ని నెట్టుకు రావడమే కష్టంగా ఉందని తల్లిదండ్రులు బాలకృష్ణ, లక్ష్మి నిట్టూర్చారు. దీంతో గోవింద్ దాతల సహాయాన్ని కోరాడు. ఈ విషయం తెలుసుకున్న మాడుగుల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు రూ.15 వేలు, మాడుగుల మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ కుమారుడు సాయి చందన్ రూ.10 వేలు, కేజేపురం మాజీ సర్పంచ్ పెంటకోట అప్పారావు రూ.10 వేలు, మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి రూ.2 వేలు ఆదివారం అందజేశారు. దాతలకు దివ్యాంగ విద్యార్థి కృతజ్ఞతలు తెలియజేశాడు.



నగదు అందజేస్తున్న ఏఎంసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు

పూతదశలో నువ్వు సాగు



గుల్లేపల్లిలో నువ్వు పంట

కె.కోటపాడు: మండలంలో నువ్వు పంట పూతదశకు చేరుకుంది. ఖరీఫ్ వరి కోతలు పూర్తయిన తర్వాత రబీ సాగుగా నువ్వు పంట పండిస్తున్నారు. ప్రధానంగా నీటి లభ్యత ఉన్న వ్యవసాయ బావులు, సాగు నీటి చెరువుల ఆధారంగా డి.అగ్రహారం, గుల్లేపల్లి, రామచంద్రపురం, కింతాడ, పిండ్రంగి, పోతనవలస, ఆర్లి, చౌడువాడ, ఎ.భీమవరం, పాడుగుపాలెం, పైడంపేట, రొంగలినాయుడుపాలెం, తదితర గ్రామాల్లో 200 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. నువ్వులకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో లాభదాయకంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

వానర మూకతో బెంబేలు

మాడుగుల రూరల్: మండలంలో కోతులు వీరవిహారం చేస్తున్నాయి. ప్రధానంగా కె.జె.పురం నుంచి దబ్బకుంటు రహదారిలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఒంటరిగా వెళ్లే మహిళల మీద దాడి చేసి గాయపరుస్తున్నాయి. పాకల వద్దకు భోజనాలు తీసుకెళ్తుండగా దాడి చేసి వాటిని తినివేస్తున్నాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు పొలాల్లో పంటలను చెరకు తోటల్లో గడలను, కొబ్బరి పిందెలను పనస కాయలను నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాకల వద్దకు వెళ్లే వారిపై దాడులు చేస్తున్నాయని రైతులు బుద్దా అప్పారావు, కాళ్ల సూరిబాబు, పాలమరశెట్టి కోటేశ్వరరావు, బుద్ద నాగేశ్వరావు, కాళ్ల వెంకట్రావు, మళ్ల సూరిబాబు, జగ్గారావు, భీశెట్టి సూర్యనారాయణ వాపోతున్నారు. దీంతోపాటు మాడుగుల మోదమాంబ కాలనీ, ఘాట్‌రోడ్డు జంక్షన్, సురవరం, తాటిపర్తి ప్రధాన రహదారిలో కోతుల గుంపులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో పండ్లు, కాయగూరల దుకాణాల్లో చొరబడి వాటిని తినివేస్తున్నాయని వాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటి నివారణకు అటవీ శాఖ, రెవెన్యూ అధికారులు చొరవ చూపాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



కె.జె.పురం -దబ్బకుంటు రోడ్డులో కోతుల గుంపు

వడ్డాది వెంకన్న సేవలో అదనపు ఎస్పీ

బుచ్చెయ్యపేట: వడ్డాది వెంకన్నను క్రైమ్ బ్రాంచ్ అదనపు ఎస్పీ పి.సత్యనారాయణ సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఇక్కడ కల్యాణోత్సవాల్లో భాగంగా నాగవల్లి వసంతోత్సవం నిర్వహించారు.





ఆశీర్వచనం స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ సత్యనారాయణ దంపతులు

తిరువీధి ఉత్సవం

చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు విస్తృతం

పరవాడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిర్దేశించిన చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ సిబ్బందిని ఆదేశించారు. దేశపాత్రునిపాలెం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన ఆదివారం సందర్శించారు. వాహనాల తనిఖీలో సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. డబ్బు, మద్యం, నాటు సారా, గంజాయి, ఉచిత కానుకలు పంపిణీని అడ్డుకోవడానికి ప్రత్యేక నిఘా పెట్టినట్టు చెప్పారు. విధుల్లో ఉన్న పోలీసులు, కేంద్ర పోలీసు బలగాలు పటిష్ట తనిఖీలు జరపాలని అదనపు ఎస్పీ విజయభాస్కర్ సూచించారు. అదనపు ఎస్పీ వెంట పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు ఉన్నారు.



వాహనాల తనిఖీలను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ విజయభాస్కర్

మోదకొండమ్మ తల్లిది ఘనమైన చరిత్ర

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: ఘనమైన చరిత్ర కలిగిన మోదకొండమ్మ తల్లిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. దొర్లసురవరంలో మోదకొండమ్మ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలు శిరస్సున పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి పూజలు చేశారు. ఒకే శ్రీరాంపురంలో మోదకొండమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తీన్‌మార్ డప్పులు, వాయిద్యాలు, మహిళల కోలాటాల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, జేడీపేట, ఎం. కోడూరు, సర్పంచ్‌లు కొసిరెడ్డి కృష్ణమూర్తి, గొల్లవిల్లి సంజీవరావు, సాగరం ఎంపీటీసీ శ్రీనాథు సూర్యకాంతం, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనాథు జగ్గారావు, యన్నంశెట్టి వెంకటరమణ, కోరుకొండ చెల్లంనాయుడు, సత్యవరం ఎంపీటీసీ తలారి అప్పారావు, శనివాడ వెంకటరమణ, జనపరెడ్డి అప్పారావు, కాళ్ల రాజు, గొకేడ అప్పలనాయుడు, కాత వెంకటరమణ, ముప్పల నానిబాబు పాల్గొన్నారు.



మోదకొండమ్మ తల్లిని దర్శించుకుంటున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, తదితరులు

టీడీపీ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తా

నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: టీడీపీ మోసాలను మరోసారి ప్రజల్లోకి తీసుకువెళ్లి ఎండగడతానని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ సోమవారం నుంచి చేపట్టే గడపగడపకు కార్యక్రమం ద్వారా 2014లో టీడీపీ ఇచ్చిన మోసాలను ప్రజలకు వివరిస్తామన్నారు. 60 హామీలిచ్చిన చంద్రబాబు వాటిని నెరవేర్చలేదన్నారు. 2019 ఎన్నికల్లో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం నెరవేర్చారన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించామన్నారు. సంక్షేమంతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. మండల కార్యాలయాలు చుట్టూ తిరిగే అవసరం లేకుండా గ్రామస్థాయిలోనే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రభుత్వ సేవలను అందిస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను నిర్వీర్యం చేసిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశారన్నారు. ప్రజలకు మేలు చేయడంతో వైఎస్సార్‌సీపీకి ఆదరణ పెరిగిందన్నారు. ప్రతి కుటుంబానికి మేలు చేశాం, కాబట్టే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి ఓటు అడుగుతున్నామన్నారు. అమలు కానీ హామీలతో టీడీపీ ప్రజలను మోసం చేసేందుకు చూస్తుందన్నారు. చంద్రబాబు మాటలకు మోసపోకుండా మేలు చేస్తున్న వైఎస్సార్‌సీపీని ఈ ఎన్నికల్లో మరోసారి ఆదరించాలన్నారు. తాను చేపట్టే గడపగడపకు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



టీడీపీ మేనిఫెస్టోను చూపుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నేడు ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం ప్రారంభం

నాతవరం: మండలంలో పి.జగ్గంపేటలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సోమవారం ఎన్నికలు ప్రచారం ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు తెలిపారు. నియోజకవర్గంలో ఏ కార్యక్రమం తలపెట్టిన మొదటిగా ఎమ్మెల్యే ఇక్కడ ప్రారంభించడం సెంటుమెంటుగా వస్తోంది. అదేవిధంగా సార్వత్రిక ఎన్నికలు ప్రచారం ఇక్కడ్నుంచే ప్రారంభించేందుకు పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఘనంగా దేవీ పెద్దింటమ్మ ఉత్సవాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న దేవదాయ శాఖ జిల్లా అధికారి యశోద, సర్పంచ్



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రోలుగుంట: కుసుర్లపూడిలో దేవీపెద్దింటమ్మ ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోనే ఎంతో ప్రతిష్ట కలిగిన ఇక్కడ అమ్మవారిని అధికారులు, నాయకులు, భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి సుధారాణి, ఈవో కిరణ్మయి, సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఘనంగా గ్రామ దేవతల పండగలు

రావికమతం: కొత్తకోట గ్రామంలో పెద్దింటమ్మతల్లి, మేడివాడ గ్రామంలో మోదకొండమ్మతల్లి పండగలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శంచుకునేందుకు భక్తులు ఉదయం నుంచి క్యూ కట్టారు. వీరి సౌకర్యార్థం ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

భక్తిశ్రద్ధలతో మట్టల పండుగ



నర్సీపట్నంలో ఈత మట్టలతో క్రైస్తవులు

నర్సీపట్నం: పట్టణంలో బెరాకా ప్రార్థన మందిరం, పెదబొడ్డేపల్లి ఆర్సీఎం చర్చిలో క్రైస్తవులు ఆదివారం మట్టల పండగ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుడ్ ఫ్రైడే ముందు వచ్చే ఆదివారం ఈ పండగ జరుపుకోవటం ఆనవాయితీగా వస్తోంది. చిన్నారులు, యువత ఈత మట్టలు పట్టుకుని యేసు క్రీస్తును స్తుతిస్తూ నగర సంకీర్తన చేశారు. అనంతరం పాస్టర్ సుందరావు మట్టల పండగ విశిష్టత గురించి వివరించారు.




మాకవరపాలెంలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

మాకవరపాలెం: క్రైస్తవులంతా మట్టల పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మట్టల పండగ సందర్భంగా మండల పాస్టర్ల ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి తామరం జంక్షన్ వరకు ర్యాలీ కొనసాగింది. క్రీస్తు ప్రార్థనా గీతాలు ఆలపించుకుంటూ ర్యాలీ చేపట్టారు. మట్టల ఆదివారం విశిష్టతను పాస్టర్లు వివరించారు. ఈ ర్యాలీలో పలు చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు.

ఆశాజనకంగా మినప దిగుబడులు

రోలుగుంట: ఈ ఏడాది అపరాల పంట పండింది. పెసలు, బొబ్బర్లు కన్నా మినుము పంట దిగుబడి బాగుంది. మండలంలో 850 ఎకరాలకుపైగా ఖరీఫ్ వరి కోతల తర్వాత మినప సాగు చేపట్టారు. పెట్టుబడులు పెద్దగా అవసరం లేని ఈ పంటకు వాతావరణం అనుకూలంగా మారడంతో ప్రతి చోటా బాగా పండింది. రైతులు పంటను సేకరించి ఇంటికి తీసుకొచ్చారు. ఎకరాలో విత్తనాలకు రూ.150, తెగుళ్ల నివారణకు పిచికారీ చేసేందుకు రూ.300 వెరసి రూ.450 పెట్టుబడి ఖర్చు అయింది. రెండు బస్తాలు పంట వచ్చింది. కుంచం రూ.300 ఉంది. బస్తాకు 26 కుంచాల చొప్పున రెండు బస్తాలకు 52 కుంచాలకు రూ.15,600 ఆదాయం రాగా, పెట్టుబడి పోను రూ.15,150 వచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పంట నుంచి మినుములు సేకరిస్తున్న రైతులు